అథ చతుర్దశో%ధ్యాయః

సోమనాథ జ్యోతిర్లింగము

ఋషయ ఊచుః |

జ్యోతిషాం చైవ లింగానాం మాహాత్మ్యం కథయాధునా | ఉత్పత్తిం చ తథా తేషాం బ్రూహి సర్వం యథాశ్రుతమ్ || 1

ఋషులు ఇట్లు పలికిరి-

జ్యోతిర్లింగముల మాహాత్మ్యమును, మరియు వాటి పుట్టుకను సర్వమును నీవు విన్నదానికి అనురూపముగా ఇప్పుడు చెప్పుము (1).

సూత ఉవాచ |

శృణ్వంతు విప్రా వక్ష్యామి తన్మాహాత్మ్యం జనిం తథా | సంక్షేపతో యథా బుద్ధి సద్గురోశ్చ మయా శ్రుతమ్ || 2

ఏతేషాం చైవ మాహాత్మ్యం వక్తుం వర్ష శ##తైరపి | శక్యతే న మునిశ్రేష్ఠాస్తథాపి కథయామి వః || 3

సోమనాథశ్చ తేషాం వై ప్రథమః పరికీర్తితః | తన్మాహాత్మ్యం శృణు మునే ప్రథమం సావధానతః || 4

సప్తవింశన్మితాః కన్యా దక్షేణ చ మహాత్మనా | తేన చంద్రమసే దత్తా అశ్వినాద్యా మునీశ్వరాః || 5

చంద్రం చ స్వామినం ప్రాప్య శోభమానా విశేషతః | చంద్రోపి చైవ తాః ప్రాప్య శోభ##తే స్మ నిరంతరమ్ || 6

హేమ్నా చైవ మణిర్భాతి మణినా హేమ చైవ హి | ఏవం చ సమయే తస్య యజ్ఞాతం శ్రూయతామితి || 7

సర్వాస్వపి చ పత్నీషు రోహిణీ నామ యా స్మృతా | యథైకా సా ప్రియా చాసీత్తథాన్యా న కదాచన || 8

అన్యాశ్చ దుఃఖమాపన్నాః పితరం శరణం యయుః | గత్వా తసై#్మ చ యద్దుఃఖం తథా తాభిర్నివేదితమ్ || 9

దక్షస్య చ తథా శ్రుత్వా దుఃఖం చ ప్రాప్త వాంస్తదా | సమాగత్య ద్విజాశ్చంద్రం శాంత్యోచద్వచస్తదా || 10

సూతుడిట్లు పలికెను-

ఓ బ్రాహ్మణులారా! వాటి ఉత్పత్తి మాహాత్మ్యములను నా బుద్ధికి చేతనైనంతలో సంక్షేపముగా చెప్పెదను వినుడు. నేను సద్గురువునుండి వినియుంటిని (2). ఓ మహర్షులారా ! వీటి మాహాత్మ్యమును చెప్పుటకు కొన్ని వందల సంవత్సరముల కాలమైననూ సరిపడదు. అయిననూ మీకు చెప్పెదను (3). వారిలో మొదటివాడు సోమనాథుడని కీర్తించబడినాడు. ఓ మునీ! కావున ముందుగా ఆయన మాహాత్మ్యమును శ్రద్ధగా వినుము (4). ఓ మహర్షులారా! మహాత్ముడగు దక్షుడు అశ్విని మొదలగు ఇరువది ఏడ్గురు కుమార్తెలను చంద్రునికిచ్చి వివాహము చేసెను (5). వారు చంద్రుని భర్తగా పొంది మిక్కిలి శోభిల్లిరి. చంద్రుడు కూడ వారిని పొంది సర్వకాలములలో శోభను కలిగియుండెను (6). బంగారమువలన మణికి, మణి వలన బంగారమునకు శోభ కలుగును గదా! ఆ సమయములో జరిగిన వృత్తాంతమును వినుడు (7). భార్యలందరిలో రోహిణి అను నామెపై చంద్రునకు గల ప్రేమ ఏ కాలమునందైననూ ఆతనికి ఇతర భార్యలపై లేకుండెను (8). మిగిలిన భార్యలు దుఃఖితులై తండ్రి వద్దకు వెళ్ళి ఆయనను శరణు పొంది తమ దుఃఖమును ఆయనతో విన్నవించుకొనిరి (9). అపుడు దక్షుడు ఆ వృత్తాంతమును విని దుఃఖితుడాయెను. ఓ బ్రాహ్మణులారా! అపుడాతడు చంద్రుని వద్దకు వచ్చి శాంతి పూర్వకముగా నిట్లు పలికెను (10).

దక్ష ఉవాచ |

విమలే చ కులే త్వం హి సముత్పన్నః కలానిధే | ఆశ్రితేషు చ సర్వేషు న్యూనాధిక్యం కథం తవ || 11

కృతం చేత్తత్కృతం తచ్చ న కర్తవ్యం త్వయా పునః | వర్తనం విషమత్వేన నరకప్రదమీరితమ్ || 12

దక్షుడు ఇట్లు పలికెను-

కళలకు నిధియగు ఓ చంద్రా! పవిత్రమగు కులములో జన్మించిన నీకు నిన్ను ఆశ్రయించిన వారి యెడల సమభావము గాక హెచ్చు తగ్గులు ఉండుటకు కారణమేమి? (11) జరిగినదేదో జరిగినది అదే తప్పును నీవు మరల చేయకుము. హెచ్చుతగ్గులను చూపుట నరకహేతువు అగునని పెద్దలు చెప్పెదరు (12).

సూత ఉవాచ |

దక్షశ్చైవం చ సంప్రార్థ్య చంద్ర జామాతరం స్వయమ్ | జగామ మందిరం స్వం వై నిశ్చయం పరమం గతః || 13

చంద్రోఽపి వచనం తస్య న చకార విమోహితః |
శివమాయాప్రభావేణ యయా సంమోహితం జగత్ || 14

శుభం భావి యదా యస్య శుభం భవతి తస్య వై | అశుభం చ యదా భావి కథం తస్య శుభం భ##వేత్ || 15

చంద్రోఽపి బలవద్భావి వశాన్మేనే న తద్వచః | రోహిణ్యాం చ సమాసక్తో నాన్యాం మేనే కదాచన || 16

తచ్ఛ్రుత్వా పునరాగత్య స్వయం దుఃఖసమన్వితః | ప్రార్థయామాస చంద్రం స దక్షో దక్షస్సునీతితః || 17

సూతుడు ఇట్లు పలికెను-

దక్షుడు తన అల్లునితో స్వయముగా నిట్లు పలికి దృఢమగు నిశ్చయము గలవాడై తన ఇంటికి వెళ్లెను (13). సర్వ జగత్తును మోహింపజేయు శివమాయచే అధికముగా మోహమును పొందియున్న చంద్రుడు దక్షుని మాటలను లెక్క చేయలేదు (14). ఎవని ప్రారబ్ధములో శుభము కలుగవలసియున్నదో, వానికి నిశ్చయముగా శుభము కలుగును. ప్రారబ్ధములో అశుభము

కలుగవలసి యున్నవానికి శుభము ఎట్లు కలుగును? (15) బలవంతమగు ప్రారబ్ధమునకు వశుడైయున్న చంద్రుడు దక్షుని వచనములను లెక్క చేయలేదు. రోహిణియందు ఆసక్తి గల ఆతడు ఇతర భార్యలనందరినీ ఉపేక్షించెను (16). నీతి శాస్త్రమునందు సమర్థుడగు ఆ దక్షుడు ఆ విషయమును విని దుఃఖముతో గూడిన వాడై మరల ఇచ్చి చంద్రుని వేడుకొనెను (17).

దక్ష ఉవాచ |

శ్రూయతాం చంద్ర యత్పూర్వం ప్రార్థితో బహుధా మయా |

న మానితం త్వయా యస్మాత్తస్మాత్త్వం చ క్షయీ భవ || 18

దక్షుడు ఇట్లు పలికెను-

ఓ చంద్రా! వినుము. పూర్వము నేను నిన్ను పలువిధములుగా ప్రార్థించియుంటిని. అయిననూ, నీవు నన్ను లెక్క చేయలేదు. కావున నీవు క్షయము కలవాడవు కమ్ము (18).

సూత ఉవాచ |

ఇత్యుక్తే తేన చంద్రో వై క్షయీ జాతః క్షణాదిహ | హాహాకారో మహానాసీత్తదేందౌ క్షీణతాం గతే || 19

దేవర్షయస్తదా సర్వే కిం కార్యం హా కథం భ##వేత్ | ఇతి దుఃఖం సమాపన్నా విహ్వలా హ్యభవన్మునే || 20

విజ్ఞాపితాశ్చ చంద్రేణ సర్వే శక్రాదయస్సురాః | ఋషయశ్చ వసిష్ఠాద్యా బ్రహ్మాణం శరణం యయుః || 21

గత్వాపి తు తదా ప్రోచుస్తద్వృత్తం నిఖిలం మునే | బ్రహ్మణ ఋషయో దేవా నత్వా నుత్వాతి విహ్వలాః || 22

బ్రహ్మాపి తద్వచశ్రుత్వా విస్మయం పరమం య౯° | శివమాయాం సుప్రశస్య శ్రావయంస్తానువాచ హ|| 23

సూతుడు ఇట్లు పలికెను-

దక్షుడు ఇట్లు పలికిన మరుక్షణములో చంద్రుడు క్షయరోగి ఆయెను. అపుడు చంద్రుడు క్షీణించగానే పెద్ద హాహాకారము చెలరేగెను (19). ఓ మునీ! అపుడు సమస్త దేవతలు మరియు ఋషులు "ఏమి చేయవలెను? ఈ గండమునెట్లు గడువవలెను?" అని కంగారు పడుతూ దుఃఖితులైరి (20). చంద్రునిచే ప్రార్థింపబడిన ఇంద్రాది దేవతలందరు మరియు వసిష్ఠాది ఋషులు బ్రహ్మను శరణు పొందిరి (21). ఓ మునీ! దేవతలు, ఋషులు ఆ సమయములో మహాదుఃఖమును పొందినవారై బ్రహ్మవద్దకు వెళ్లి ఆయనకు ప్రణమిల్లి స్తుతించి ఆ వృత్తాంతమునంతనూ చెప్పిరి (22). బ్రహ్మ కూడా వారి వచనములను విని మిక్కిలి చకితుడై శివమాయను అధికముగా ప్రశంసించి వారితో నిట్లు పలికెను (23).

బ్రహ్మోవాచ |

అహోకష్టం మహజ్జాతం సర్వలోకస్య దుఃఖదమ్ | చంద్రస్తు సర్వదా దుష్టో దక్షస్తు శప్తవానముమ్ || 24

సర్వం దుష్టేన చంద్రేణ కృతం కర్మాప్యనేకశః |
శ్రూయతామృషయో దేవాశ్చంద్రకృత్యం పురాతనమ్ || 25

బృహస్పతేర్గృహం గత్వా తారా దుష్టేన వై హృతా | తస్య భార్యాం పునశ్చైవ స దైత్యాన్ సముపస్థితః || 26

సమాశ్రితస్తదా దైత్యాన్ యుద్ధం దేవైశ్చకార హ | మయా%త్రిణా నిషిద్ధశ్చ తస్మై#్మ తారాం దదౌ శశీ || 27

తాం చ గర్భవతీం దృష్ట్వా న గృహ్ణామీతి సో%బ్రవీత్ |
అస్మాభిర్వారితో జీవః కృచ్ఛ్రాజ్జగ్రాహ తాం తదా ||28

యది గర్భం జహాతీహ గృహ్ణామీత్యబ్రవీత్పునః | గర్భే మయా పునస్తత్ర త్యాజితే మునిసత్తమాః || 29

కస్యాయం చ పునర్గర్భస్సోమస్యేతి చ సా%బ్రవీత్ | పశ్చాత్తేన గృహీతా సా మయా చ వారితేన వై || 30

ఏవం విధాని చంద్రస్య దుశ్చరిత్రాణ్యనేకశః | వర్ణ్యంతే కిం పునస్తాని సో%ద్యాపి కురుతే కథమ్ || 31

యజ్జాతం తత్సుసంజాతం నాన్యథా భవతి ధ్రువమ్ | అతః పరముపాయం వో వక్ష్యామి శృణుతాదరాత్ || 32

ప్రభాసకే శుభే క్షేత్రే వ్రజేచ్చంద్రస్సదైవతైః | శివమారాధయేత్తత్ర మృత్యుంజయవిధానతః || 33

నిధాయేశం పురస్తత్ర చంద్రస్తపతు నిత్యశః | ప్రసన్నశ్చ శివః పశ్చా దక్షయం తం కరిష్యతి || 34

బ్రహ్మ ఇట్లు పలికెను-

అయ్యో! సర్వప్రాణులకు దుఃఖమును కలిగించే పెద్ద కష్టము వచ్చినది. చంద్రుడు సర్వకాలములలో దుష్టుడే. ఇపుడు వానిని దక్షుడు శపించినాడు (24). దుష్టుడగు చంద్రుడు అనేక పర్యాయములు ఇట్టి పనులను చేసియున్నాడు. వానిని పూర్తిగా దుష్టప్రవృత్తి. ఓ ఋషులారా! దేవతలారా! చంద్రుడు పూర్వములో చేసిన పనిని గురించి వినుడు (25). ఆ దుష్టుడు బృహస్పతి ఇంటికి వెళ్లి. ఆయన భార్యయగు తారను అపహరించి, అంతేగాక రాక్షసులనాశ్రయించినాడు (26). అపుడా చంద్రుడు రాక్షసుల ఆశ్రయమును పొంది దేవతలతో యుద్ధమును చేసినాడు. నేను, అత్రి మందలించగా ఆతడు తారను బృహస్పతికి అప్పజెప్పినాడు (27). ఆమె గర్భవతియై యుండుటను గాంచి బృహస్పతి ఆమెను స్వీకరించుటకు నిరాకరించెను. మేము నచ్చజెప్పిన తరువాత అతికష్టము మీద ఆమెను స్వీకరించెను (28). ఈమె గర్భమును విడిచిపెట్టినచో నేను స్వీకరించెదనని ఆయన పలికెను. ఓ మహర్షులారా! అపుడామె ఆ గర్భమును పరిత్యజించునట్లు నేను చేసితిని (29). 'ఈ గర్భము ఎవరిది?' అని ప్రశ్నించగా 'చంద్రునిది' అని ఆమె బదులు చెప్పెను. తరువాత నేను నచ్చజెప్పగా ఆయన ఆమెను స్వీకరించెను (30). ఈ విధముగా చంద్రుడు చేసిన తప్పుడు పనులు చాల గలవు. వాటిని వర్ణించి ప్రయోజనమేమి గలదు? ఆతడు ఇప్పటికీ అటులనే

ప్రవర్తించుటకు కారణమేమి? (31). ఏది జరిగినా మన మంచికే. విధికి భిన్నముగా ఏదియూ ఘటిల్లదనుట నిశ్చయము. కావున మీకు గొప్ప ఉపాయమును చెప్పెదను. శ్రద్ధతో వినుడు (32). చంద్రుడు శుభకరమగు ప్రభాసక్షేత్రమునకు దేవతలతో సహా వెళ్లి అచట యథావిధిగా మృత్యుంజయ మంత్రమును జపిస్తూ శివుని ఆరాధించవలెను (33). అచట చంద్రుడు తన ఎదుట శివలింగమును స్థాపించి నిత్యము తపస్సును చేయుగాక! శివుడు ప్రసన్నుడై తరువాత ఆతని క్షయరోగమును నిర్మూలించగలడు (34).

సూత ఉవాచ |

ఇతి శ్రుత్వా వచస్తస్య బ్రహ్మణస్తే సురర్షయః |
సంనివృత్యాయయుస్సర్వే యత్ర దక్షవిధూ తతః || 35

గృహీత్వా తే తతశ్చంద్రం దక్షం చాశ్వాస్య నిర్జరాః | ప్రభాసే ఋషయశ్చక్రుస్తత్ర గత్వాఖిలాశ్చ వై || 36

ఆవాహ్య తీర్థ వర్యాణి సరస్వత్యాదికాని చ | పార్థివేన తదా పూజాం మృత్యుంజయవిధానతః || 37

తే దేవాశ్చ తదా సర్వే ఋషయో నిర్మలాశయాః | స్థాప్య చంద్రం ప్రభాసే చ స్వం స్వం ధామ యయుర్ముదా || 38

చంద్రేణ చ తపస్తప్తం షణ్మాసం చ నిరంతరమ్ | మృత్యుంజయేన మంత్రేణ పూజితో వృషభధ్వజః || 39

దశకోటిమితం మంత్రం సమావృత్య శశీ చ తమ్ | ధ్యాత్వా మృత్యుంజయం మంత్ర తస్థౌ నిశ్చలమానసః || 40

తం దృష్ట్వా శంకరో దేవః ప్రసన్నో%భూత్తతః ప్రభుః | ఆవిర్భూయ విధుం ప్రాహ స్వభక్తం భక్తవత్సలః || 41

సూతుడు ఇట్లు పలికెను-

అపుడు ఆ సమస్త దేవతలు మరియు ఋషులు ఆ బ్రహ్మయొక్క వచనములను విని, తరువాత దక్షుడు, చంద్రుడు ఉన్న స్థలమునకు మరలి వచ్చిరి (35). తరువాత సకలదేవతలు మరియు ఋషులు దక్షుని ఓదార్చి చంద్రుని దోడ్కొని ప్రభాసక్షేత్రమునకు వెళ్లి అచట లింగమును స్థాపించిరి (36). వారు సరస్వతి మొదలగు శ్రేష్ఠనదులను ఆహ్వానించిరి. పార్థివలింగమును స్థాపించి పూజించిరి. యథావిధిగా మృత్యుంజయమంత్రమును పఠించిరి (37). అపుడా సకలదేవతలు మరియు పవిత్రాంతఃకరణులగు ఋషులు చంద్రుని ప్రభాసక్షేత్రములో నుంచి తమ తమ స్థానములకు ఆనందముతో వెళ్లిరి (38). చంద్రుడు ఆరు మాసములు నిరంతరమగు తపస్సును చేసెను. ఆతడు మృత్యుంజయ మంత్రముతో వృషభధ్వజుడగు శివుని పూజించెను (39). చంద్రుడు మృత్యుంజయ మంత్రమును పదికోట్ల జపము చేసి నిశ్చలమగు మనస్సుతో శివుని ధ్యానించి స్థిరుడై యుండెను (40). అపుడాతనిని గాంచి భక్తవత్సలుడగు శంకరదేవుడు ప్రసన్నుడాయెను. ఆ ప్రభుడు తన భక్తుడగు చంద్రుని యెదుట ఆవిర్భవించి ఇట్లు పలికెను (41).

శంకర ఉవాచ |

వరం వృణీష్వ భద్రం తే మనసా యత్సమీప్సితమ్ |
ప్రసన్నో%హం శశిన్ సర్వం దాస్యే వరమనుత్తమమ్ || 42

శంకరుడిట్లు పలికెను-

ఓ చంద్రా! నీ మనస్సునకు నచ్చిన వరమును కోరుకొనుము. నీకు మంగళమగుగాక! నేను ప్రసన్నుడనైతిని. నీవు కోరిన శ్రేష్ఠవరములనన్నిటినీ ఈయగలను (42).

చంద్ర ఉవాచ|

యది ప్రసన్నో దేవేశ కిమసాధ్యం భ##వేన్మమ | తథాపి మే శరీరస్య క్షయం వారయ శంకర || 43

క్షంతవ్యో మే%పరాధశ్చ కల్యాణం కురు సర్వదా | ఇత్యుక్తే చ తదా తేన శివో వచన మబ్రవీత్ || 44

చంద్రుడిట్లు పలికెను-

ఓ దేవదేవా! నీవు ప్రసన్నుడవైనచో, నాకు సాధ్యము కానిది ఏమి ఉండును? ఓ శంకరా! అయిననూ, నా శరీరముయొక్క క్షయరోగమును నివారింప జేయుము (43). నా అపరాధమును మన్నించి నాకు సర్వకాలములయందు మంగళమును కలిగించుము. ఆతడిట్లు పలుకగా, అపుడు శివుడు ఇట్లు చెప్పెను (44).

శివ ఉవాచ |

పక్షే చ క్షీయతాం చంద్ర కలా తే చ దినే దినే | పునశ్చ వర్ధతాం పక్షే సా కలా చ నిరంతరమ్ || 45

శివుడు ఇట్లు పలికెను-

ఓ చంద్రా! నీ కళలు మాసములోని మొదటి పక్షములో దినమునకు ఒకటి చొప్పున తగ్గి మరల ఆ కళలు రెండవ పక్షములో పెరుగుచుండును. ఇట్లు నిరంతరముగా జరుగుచుండును (45)

సూత ఉవాచ|

ఏవం సతి తదా దేవా హర్షనిర్భరమానసాః | ఋషయశ్చ తదా సర్వే సమాజగ్ముర్ముదం ద్విజాః || 46

ఆగత్య చ తదా సర్వే చంద్రాయాశిషమబ్రువన్ | శివం నత్వా కరౌ బద్ధ్వా ప్రార్థయామాసురాదరాత్ || 47

సూతుడు ఇట్లు పలికెను-

ఓ బ్రాహ్మణులారా! ఇట్లు జరుగగా అపుడు దేవతలు ఆనందముతో నిండిన మనస్సు గలవారైరి. అపుడు వెంటనే ఋషులందరు అచటకు విచ్చేసిరి (46). వారు అందరు అచటకు వచ్చి

చంద్రునకు ఆశీస్సులను పలికి, చేతులను జోడించి శివునకు నమస్కరించి ఆదరముతో ప్రార్థించిరి (47).

దేవా ఊచుః |

దేవ దేవ మహాదేవ పరమేశ నమో%స్తు తే | ఉమయా సహితశ్శంభో స్వామిన్నత్ర స్థిరో భవ || 48

దేవతలు ఇట్లు పలికిరి-

ఓ దేవ దేవా! మహాదేవా! పరమేశ్వరా! నీకు నమస్కారమగుగాక! ఓ శంభూ! నీవు పార్వతితో గూడి ఇచట స్థిరముగా నుండుము (48).

సూత ఉవాచ |

తతశ్చంద్రేణ సద్భక్త్యా సంస్తుతశ్శంకరః పురా | నిరాకారశ్చ సాకారః పునశ్చైవాభవత్ర్పభుః || 49

ప్రసన్నశ్చ స దేవానాం క్షేత్రమాహాత్మ్యహేతవే | చంద్రస్య యశ##సే తత్ర నామ్నా చంద్రస్య శంకరః || 50

సోమేశ్వరశ్చ నామ్నాసీద్విఖ్యాతో భువనత్రయే | క్షయకుష్ఠాదిరోగాణాం నాశకః పూజనాద్ద్విజాః || 51

ధన్యో%యం కృతకృత్యో%యం మన్నామ్నా శంకరస్స్వయమ్ స్థితశ్చ జగతాం నాథః పావయఞ్జగతీతలమ్ || 52

తత్కుండం తైశ్చ తత్రైవ సర్వైర్దేవైః ప్రతిష్ఠితమ్ | శివేన బ్రహ్మణా తత్ర హ్యావిభక్తం తు తత్పునః || 53

చంద్రకుండం ప్రసిద్ధంచ పృథివ్యాం పాపనాశనమ్ | తత్ర స్నాతి నరో యస్స సర్వైః పాపైః ప్రముచ్యతే || 54

రోగాస్సర్వే క్షయాద్యాశ్చ హ్యసాధ్యా యే భవంతి వై | తే సర్వే చ క్షయం యాంతి షణ్మాసం స్నానమాత్రతః || 55

ప్రభాసం చ పరిక్రమ్య పృథివీక్రమసంభవమ్ | ఫలం ప్రాప్నోతి శుద్ధాత్మా మృతస్స్వర్గే మహీయతే || 56

సూతుడు ఇట్లు పలికెను-

అపుడు చంద్రుడు ముందుగా సాకారుని, ఆ తరువాత నిరాకరుడు అగు శంకరుని పవిత్రమగు భక్తితో చక్కగా స్తుతించెను. అపుడా శంకరప్రభుడు దేవతలయందు ప్రసన్నుడై ఆ క్షేత్రమునకు మహిమను కలిగించు ఉద్దేశ్యముతో మరియు చంద్రుని కీర్తిని విస్తరింపజేయుటకై అచట చంద్రుని పేరుతో వెలిసెను (49, 50). ఓ బ్రాహ్మణులారా! ఆయన ముల్లోకములో సోమేశ్వరుడని ప్రసిద్ధిని గాంచి పూజించువారలకు క్షయ, కుష్ఠ మొదలగు రోగములను పోగొట్టుచున్నాడు (51). జగన్నాథుడగు శంకరుడు ఎవని పేరుతో స్వయముగా వెలసి ముల్లోకములను పావనము చేయుచున్నాడో, అట్టి ఈ చంద్రుడు ధన్యుడు మరియు కృతకృత్యుడు (52). దేవతలు అందరు కలిసి అచట చంద్రకుండమును ప్రతిష్ఠించిరి. శివుడు మరియు బ్రహ్మ దానియందు విభేదము లేకుండగా సమానముగా వెలిసియున్నారు (53). భూమండలమునందు ప్రసిద్ధిని గాంచి పాపములను పోగొట్టే ఆ చంద్రకుండమునందు స్నానమును చేయు మానవుడు పాపములన్నింటినుండి విముక్తుడగును (54). దానియందు ఆరు మాసములు స్నానమును చేసినచో, క్షయ మొదలగు మొండి, వ్యాధులన్నియు నశించును (55). పరిశుద్ధమగు అంతఃకరణముతో ప్రభాసక్షేత్రమును చుట్టివచ్చిన మానవుడు భూమిని ప్రదక్షిణము చేసిన ఫలమును పొంది మరణించిన పిదప స్వర్గమునందు మహిమను గాంచును. (56).

సోమలింగం నరో దృష్ట్వా సర్వపాపాత్ప్రముచ్యతే | లబ్ధ్వా ఫలం మనోభీష్టం మృతస్స్వర్గం సమీహతే || 57

యద్యత్ఫలం సముద్దిశ్య కురుతే తీర్థముత్తమమ్ |
తత్తత్ఫలమవాప్నోతి సర్వథా నాత్ర సంశయః ||58

ఇతి తే ఋషయో దేవాః ఫలం దృష్ట్వా తథావిధమ్ | ముదా శివం నమస్కృత్య గృహీత్వా చంద్రమక్షయమ్ || 59

పరిక్రమ్య చ తత్తీర్థం ప్రశంసంతశ్చ తే యయుః | చంద్రశ్చాపి స్వకీయం చ కార్యం చక్రే పురాతనమ్ || 60

ఇతి సర్వస్సమాఖ్యాతస్సోమేశస్య సముద్భవః | ఏవం సోమేశ్వరం లింగం సముత్పన్నం మునీశ్వరాః || 61

యశ్శృణోతి తదుత్పత్తిం శ్రావయేద్వా పరాన్నరః | సర్వాన్ కామానవాప్నోతి సర్వపాపైః ప్రముచ్యతే || 62

ఇతి శ్రీ శివమహాపురాణ కోటిరుద్రసంహితాయం సోమనాథ జ్యోతిర్లింగోత్పత్తి వర్ణనం నామ చతుర్థశోఽధ్యాయః (14).

సోమలింగమును దర్శించిన మానవుడు సర్వపాపములనుండి విముక్తుడై మనోభీష్టములగు ఫలములన పొంది మరణించిన తరువాత స్వర్గమును పొందును (57). మానవుడు ఏయే ఫలములను గోరి ఈ ఉత్తమతీర్థమును దర్శించునో, ఆయా ఫలములను పొందుననుటలో సందేహము లేదు (58). ఆ విధముగా ఫలమునిచ్చే మహిమను గాంచి ఋషులు మరియు దేవతలు ఆనందముతో శివునకు నమస్కరించి క్షయరోగవినిర్ముక్తుడైన చంద్రుని దోడ్కొని (59). ఆ తీర్థమునకు ప్రదక్షిణమును చేసి దానిని కొనియాడుచు వెళ్ళిరి. చంద్రుడు కూడ పూర్వము తాను చేసిన కర్తవ్యమును నెరవేర్చుట మొదలిడెను (60). ఓ మహర్షులారా! ఈ విధముగా సోమేశ్వరలింగము ఆవిర్భవించిన వృత్తాంతమునంతనూ చెప్పియుంటిని (61). ఏ మానవుడైతే దాని ఆవిర్భావమును గూర్చి వినునో, లేదా ఇతరులకు వినిపించునో, అట్టివాడు కోర్కెలనన్నిటినీ పొంది సర్వపాపముల నుండి విముక్తుడగును (62).

శ్రీ శివమహాపురాణములోని కోటిరుద్ర సంహితయందు సోమేశ్వరజ్యోతిర్లింగావిర్భావమును వర్ణించే పదునాల్గవ అధ్యాయము ముగిసినది (14).